# తీయని ఆకలి

సూట్‌కేసు పక్కనే పెట్టుకొని శ్రద్ధానందఘాట్ రేవులో ఓ పావంచా మీద కూర్చుని మూర్తికోసం, గోపాలంకోసం యెదురు చూస్తున్నాను. ముగ్గురం కలిసి శ్రీరామ నవమికి భద్రాచలం వెళ్ళాలని ప్రయాణం. వాళ్ళింతకీ రావడంలేదు. తెల్లవారడానికి యింకా రెండుగంటల టైం వుంది. లాంచీ బయలుదేరడానికి సిద్ధంగా వుంది. యాత్రికులు లాంచీ ఎక్కుతున్నారు. వాళ్ళొచ్చేదాకా చేసేదిలేక గోదావరిని చూస్తూ కూర్చున్నాను.

గోదావరి నిర్మలంగా వుంది. నింగిలోని తారలు, చందమామ, మేఘాల వింత బొమ్మలు గోదావరిలో లీలగా కదులుతున్నాయి. అది చూస్తుంటే నింగి నేలకి దిగినట్లుంది. తేటనీటి చిరుకెరటాల అల్లిబిల్లి పరుగులు రేవులోని లాంచీలను, పడవలను మెల్లగా ఊయల లూపుతున్నాయి. ఆ కెరటాలు వొచ్చి శ్రద్ధానందఘాట్ మెట్లకు తగిలి విరుగుతూంటే - గజ్జెల పాపాయి పరుగుల సవ్వడి వినవస్తోంది.

మూర్తి, గోపాలం వచ్చారు.

"ఇంత ఆలస్యం యేవిట్రా?" అన్నాను కాస్త చిరాగ్గా.

"మెళకువ రాలేదురా" అన్నాడు గోపాలం. "పదండి. లాంచీ బయలుదేరబోతోంది" అని తొందరచేశాను వాళ్ళిద్దర్నీ.

ముగ్గురం కేబిన్‌లోకి చేరాం.

మేం ఆర్ట్స్ కాలేజీలో బియ్యే చదువుతున్నాం. మా వేషం, హడావిడీ చూసి 'వీళ్ళతో యెందుకొచ్చిన గొడవ' అనుకొని మాకు ప్రత్యేకంగా కేబిన్ యిచ్చాడు లాంచీ కండక్టరు.

కేబిన్‌లో మేమూ -

లాంచీకి యిటూ అటూ రెండు గూడు పడవలు.

పడవల్లో యాత్రికులు.

యాత్రికుల్లో ఆడా, మగా, పిల్లలు.

కేబిన్ వెనక లాంచీ బాడీలో మరికొందరు యాత్రికులు. కేబిన్‌కి ముందు లాంచీ యింజను.

లాంచీ బయలుదేరింది.

'డుప్ డుప్'మని యింజను చప్పుడు.

అడగాలంటే మొహమాటం. అడగందే అమ్మేనా పెట్టదు. వాళ్ళంతా కడుపారా తింటూంటే మేం కళ్ళారా చూస్తూ కూర్చున్నాము.

"దగ్గర్లో హోటల్సు యేమీ వుండవా?" అన్నాడు గోపాలం.

"గోదావరి మధ్యలో హోటలేవిట్రా?" అన్నాను నేను.

"వొడ్డునేనోయ్."

"మనకోసం వాడాపుతాడేవిటి? అయినా వొడ్డున చెట్లూ, మొక్కలు, యిసుక తప్ప యింకేం కనపడటం లేదు" అన్నాను.

ఏమీ తోచక మా గోపాలం కేబిన్ వెనక వున్న కిటికీలోంచి లాంచీ బాడీలోకి చూశాడు. అలా చూస్తూ వుండిపోయి మా సంగతే మర్చిపోయాడు.

"ఏవిట్రా అటే చూస్తూవుండిపోయావ్" అన్నాడు మూర్తి.

"మంచి చిత్రమైన కేసురా" అన్నాడు మా వైపు తిరక్కుండానే గోపాలం.

మే మిద్దరం కూడా లేచి చూశాం. బనీను, కాకీనిక్కరు వేసుకొని, నుదుట నామాలు పెట్టుకొని అరవై పైదాటినవాడు, అతని పక్కనే ముప్పైదాటని ఒకావిడ కనిపించారు. వేషం చూస్తే అతను రిటైర్డు కానిస్టేబిల్‌లా వున్నాడు. అతని కాళ్ళు వొళ్ళో పెట్టుకొని నొక్కుతున్న ఆ ముప్పై యేళ్ళావిడ అతనికి రెండో పెళ్ళాంలాగో, మూడోపెళ్ళాంలాగో వుంది.

ఆవిడ మా గోపాలాన్ని వోరగా చూస్తోంది. అది గమనిస్తూన్న రిటైర్డు కానిస్టేబిలు "కాళ్ళు నొక్కమంటే దిక్కులు చూస్తావేమిటి?" అని చిరాకుపడ్డాడు.

"ఊ! నొక్కుతున్నాగా?" అందావిడ కాస్త గట్టిగా నొక్కుతూ.

మా గోపాలం అలా చూస్తూ నిలబడి వుండకపోతే ముసలాడు కనుకుతీసేవాడేమో. మావాడి చూపులు ఆ ముసలాడి కంట్లో నలుసుల్లా తాకడంతో పడుచుపెళ్ళాన్ని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.

అభిమానంతో కాదు. అనుమానంతో.

"చూసింది చాల్లెద్దు. కూర్చో" అని మా గోపాలం జబ్బపట్టుకుని కూర్చోపెట్టాను కేబిన్‌లో.

"పిల్లలకోసం యాత్ర కాబోలు పాపం!" అన్నాడు గోపాలం.

"వాళ్ళ యాతన వాళ్ళని పడనీ. వెళ్ళేది భద్రాచలం. నువ్వు గోపాలానివన్న సంగతి మర్చిపోయి, యీ రెండ్రోజులూ రాముడిలా వుండరా" అన్నాడు మూర్తి కొంటెగా.

"నే నావిడకోసం కాదోయ్ చూసేది. పక్కనే అరటిపళ్ళ గెలుంది. మచ్చికచేసుకుంటే ఓ అత్తం యిస్తుందేమోనని!" అన్నాడు గోపాలం చిరుకోపంగా.

"మరైతే వెళ్ళి అడుగు" అన్నాడు.

"ఆ ముసలాడి వాలకం చూస్తే అడిగితే నన్నూ ఆవిడినీ తన్నేలా వున్నాడు."

ముప్పైయేళ్ళ క్రితంనాటి ప్రయాణమది. ఆ ప్రయాణం తర్వాత మేం ముగ్గురం మాకు దొరికిన దారుల్లో, ముప్పై యేళ్ళు జీవనయానం చేశాం. ఉన్నత బాధ్యతలు నిర్వహించాం. ఆస్తులు సంపాదించాం. సంఘంలో పేరు ప్రతిష్ఠలు పోగుచేసుకున్నాం.

గోపాలానికి తల నెరిసిపోయింది.

మూర్తి పళ్ళు కట్టించుకున్నాడు.

నాకు బట్టతల.

రిటైరయిపోయి ముగ్గురం మళ్ళీ రాజమండ్రీ చేరుకున్నాం. సాయంత్రపువేళ గోదావరి గట్టునే నడిచి శ్రద్ధానందఘాట్‌లో కాస్సేపు కూర్చొని యింటికి చేరుకుంటున్నాం.

ఒక రోజున మా గోపాలం గోదావరిని పాయలు చేసుకుంటూ పోతున్న లాంచీని చూసి "ఒక్కసారి మనం ముగ్గురం భద్రాచలం ట్రిప్పవేస్తే యెలా వుంటుందంటావు?" అన్నాడు నావంక చూసి.

"ఎప్పుడో స్టూడెంటు లైఫ్‌లో వెళ్ళాం. నాకూ వెళ్ళాలనే వుంది," అన్నాను నేను.

"రైట్. పిల్లాజల్లా బాదరబంది పెట్టుకోకుండా వెనకటిలాగే మన ముగ్గురమే వెడదాం. నవమికి వెళ్ళి కళ్యాణం చూసొద్దాం" బలపరిచాడు మూర్తి.

ముగ్గురం బయలుదేరాం స్వామి కళ్యాణానికి. ఈసారి మా హోదాకి తగ్గట్టుగా సకల సదుపాయాలూ అమర్చుకొని బయలుదేరాం. ఇంట్లోని ఆడవాళ్ళు స్టీలు కారేజీలో పులిహోర, ఆవడలు, పూతరేకులు లాంటివి యేవేవో పెట్టారు. మా గోపాలం వాడికి కావాల్సిన చేగోడీలు మిరపకాయబజ్జీలు లాంటి అనుపానాలు కూడా తెచ్చుకున్నాడు.

ప్రయాణం సాగుతోంది.

ఆడుకుందుకు పేకలున్నాయి. కాల్చడానికి సిగరెట్లున్నాయి. తినడానికి పుష్కలంగా తిండి వుంది.

సూర్యుడు నడినెత్తికొచ్చాడు. మేం పేక ఆడుతూనే ఉన్నాం. సిగరెట్లు కాలుస్తూనే వున్నాం. పెద్ద ఫ్లాస్కులోని కాఫీ తాగుతూనే వున్నాం.

సూర్యుడు పడమటికి వాలాడు.

అయినా మాకు అంత ఆకలిగా లేదు. 'తిన్నా, తినకపోయినా ఫరవాలేదు' అన్నట్టుంది.

మొత్తానికి ముగ్గురం యేదో యెంగిలిపడ్డాం.

మర్నాడు మధ్యాహ్నం నాకో ఆలోచన వచ్చింది. చిన్నతనంలోలా సరంగు నడిగి పప్పుచారూ అన్నం ఉల్లిపాయ నంజుతో తింటే ఎలా వుంటుందా-అని.

మావాళ్ళతో చెప్పకుండా సరంగును ఒప్పించి వచ్చాను. ఆ భోజనం చేయడానికి ముగ్గురం వెళ్ళాం. సరంగు వొడ్డించాడు. ఈసారి కూర కూడా వుంది కంచంలో.

